సాక్షి
చిత్తూరు
ఆదివారం । 17 । మార్చి । 2024



ఎన్నికల నగారా మోగె!

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

- 8లో



ప్రోటోకాల్ దర్శనాలు రద్దు

ఎన్నికల కోడ్ కారణంగా కాణిపాకం వినాయకస్వామి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు ర్దు చేశారు.

- 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
చిత్తూరు	6.29	4.59
పుంగనూరు	6.30	5.04

న్యూస్‌రీల్

నేడు పూతలపట్టు నియోజక వర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

పూతలపట్టు(యాదమరి):పూతలపట్టు నియోజక వర్గంలోని ఐదు మండలాలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు ఆదివారం పర్యటించనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు ఐరాల, 11కి తవణంపల్లె, మధ్యాహ్నం ఒంటి గంటకు బంగారుపాళ్యం, 3 గంటలకు యాదమరి మండలంలో పర్యటించనున్నట్లు వివరించారు.

హైవేల విస్తరణకు రూ.1,346 కోట్లు



మంత్రి రోజా అందించిన వినతిని పరిశీలిస్తున్న కేంద్రమంత్రి గడ్కరీ (ఫైల్)

నగరి : జిల్లాలో పలు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రప్రభుత్వం రూ.1,343 కోట్లు మంజూరు చేసింది. శనివారం ఈమేరకు మంత్రి ఆర్‌కే రోజాకు సంబంధిత అధికారులు సమాచారం అందించారు. గత ఏడాది తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మంత్రి రోజా మర్యాదపూర్వకంగా కలిశారు. హైవేల విస్తరణ ఆవశ్యకతను వినతి పత్రం ద్వారా వివరించారు. ఈ క్రమంలోనే ఇటీవల విజయవాడకు వచ్చిన కేంద్రమంత్రిని మరోసారి కలిసి ఈ అంశాన్ని గుర్తుచేశారు. తిరుత్తణి– పుత్తూరు రోడ్డును ఫోర్‌లేన్‌గా మార్చాలని, కల్లూరు నుంచి రేణిగుంట వరకు 4 లేన్ల రోడ్డును 6లేన్లుగా విస్తరించాలని విన్నవించారు. రేణిగుంట– నాయుడుపేట మార్గంలో సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి రోజా వినతులపై స్పందించిన కేంద్ర మంత్రి ఆయా పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇందుకోసం నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి రోజా కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు



కవాతు చేస్తున్న సాయుధ పోలీసులు

నింద్ర : మండల కేంద్రంలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. నగరి రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి ఆధర్యంలో ఫ్లాగ్ మార్చ్ చేపట్టాయి. సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సాయుధ బలగాల కవాతు నిర్వహించినట్లు వెల్లడించారు. ఎస్ఐ రామచంద్ర, ఏఎస్ఐ ఏలుమలై పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు కలెక్టరేట్ : ఆన్‌లైన్ మోసాలపై పొదుపు మహిళలు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ తులసి సూచించారు. శనివారం జిల్లా సమాఖ్య సమావేశ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్ రూపొందించుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, బీమా, పెన్షన్ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం మృతి చెందిన డిపాజిటర్స్ ఖాతాలు, వారసుల ఖాతాకు సొమ్ము చెల్లింపుల్లో తలెత్తే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం హరీష్ పాల్గొన్నారు.





శ్రీకాళహస్తిలో సంబరాలు

- ఒకేసారి 14 అసెంబ్లీ, 3 ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- ఎనిమిది మంది కొత్తవారికి, ఆరుగురు పాతవారికి అవకాశం
- ప్రస్తుత ఎంపీలే తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు
- ఆర్‌కే రోజాతో పాటు కొత్తగా మరో మహిళకు అవకాశం
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్

సాక్షి, తిరుపతి/చిత్తూరు: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు వైఎస్సార్‌సీపీ ఒకే సారి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించి యుద్ధానికి 'సై' అంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ప్రకటించిన మూడు పార్లమెంట్, 14 శాసన సభ స్థానాలకు బరిలోకి దింపిన అభ్యర్థులందరూ విద్యావంతులే. నగరి నుంచి మంత్రి ఆర్‌కే రోజాతో పాటు మరో మహిళకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. గంగాధరనెల్లూరు అసెంబ్లీకి కృపాలక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. మొత్తంగా చూస్తే ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటే.. కుప్పం, పలమనేరు స్థానాలు బీసీలకు కేటాయించారు. 14 మంది అభ్యర్థుల్లో ఎనిమిది మంది కొత్తవారికి అవకాశం ఇవ్వడం విశేషం.

నయా జోష్

ప్రజలు కోరుకున్న వారినే అభ్యర్థులుగా ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. నగరిలో ఆర్‌కే రోజాని మరోసారి అభ్యర్థిగా ప్రకటించడంతో అభిమాను లు సంబరాల్లో మునిగి తేలారు. అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పార్టీ శ్రేణులు, స్థానికులు బాణసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ.. అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజల చేత మన్ననలను పొందుతుండడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధీమాగా ఉన్నారు.



పుత్తూరులో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మొదలైన పొలిటికల్ హీట్



వీడియో కాన్ఫరెన్స్‌లో కోడ్ ఆఫ్ కండక్ట్‌పై దిశానిర్దేశం చేస్తున్న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి

తిరుపతి అర్బన్: జిల్లాలో పొలిటికల్ హీట్ మొదలైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో కోడ్ అమల్లోకి వచ్చింది. నేటి నుంచి ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొత్తగా చేయడానికి వీల్లేదు. ఇప్పటికే ప్రారంభమైన వాటిని మాత్రం కొనసాగించవచ్చు. ఏదైనా అత్యవసరం అయితే ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. జిల్లాలో 2024 జనవరి 22 వరకు ఓటర్ల లెక్కలు చూస్తే పురుషులు 8,68,273 మంది, స్త్రీలు 9,10,597 మంది, ట్రాన్స్‌జెండర్లు 188 మంది ఉన్నారు. మొత్తంగా 17,79,058 ఓటర్లు ఉన్నట్టు అధికారులు తెలిపారు. యువ ఓటర్లు(తొలిసారి ఓటు పొందిన వారు) 30,506 మంది ఉన్నట్టు వెల్లడించారు. ఎన్నికలకు వారం రోజులు ముందు వరకు అర్హత ఉన్నవారు ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

చిత్తూరు జిల్లా

పుంగనూరు నియోజకవర్గం



అభ్యర్థి పేరు: డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
హోదా : రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనులశాఖ మంత్రి
విద్యార్హతలు: ఎంఏపీహెచ్‌డీ (సోషియాలజీ) ఆగ్రేరియన్ ఎకనామిక్ రూరల్ రాయలసీమ రిలేషన్ జాయింట్ ఫ్యామిలీ.
కుటుంబ వివరాలు : భార్య స్వర్ణలత, కుమారుడు పీవీ. మిథున్‌రెడ్డి, ఎంపీ రాజంపేట, (లోక్ సభ ప్యానల్ స్పీకర్)
రాజకీయ నేపథ్యం: 1974 ఎస్వీయూ విద్యార్థి అధ్యక్షుడిగా ఏకగ్రీవం. 1978లో పీలేరు ఎమ్మెల్యే పదవికి పోటీ.
- 1989లో చల్లా ప్రభాకర్‌రెడ్డిపై విజయం, 1999, 2004లో జీవీ.శ్రీనాథరెడ్డిపై విజయం, 1995 నుంచి 2004 వరకు డీసీసీ అధ్యక్షుడు, 2008లో పీసీసీ ఉపాధ్యక్షుడిగా నియామకం, 2009లో పుంగనూరు ఎమ్మెల్యే, అటవీశాఖ మంత్రి. 2004, 2014, 2019 ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం.

నగరి నియోజకవర్గం



అభ్యర్థి పేరు : ఆర్‌కే రోజా
విద్యార్హతలు : డిగ్రీ, పొలిటికల్ సైన్స్
ప్రస్తుత హోదా : రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక శాఖ మంత్రి
కుటుంబం వివరాలు : భర్త ఆర్‌కే సెల్వమణి, తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కుమార్తె అన్షుమాలిక, కుమారుడు కృష్ణ కౌశిక్
రాజకీయ నేపథ్యం: 1999లో టీడీపీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2004లో నగరి, 2009లో చంద్రగిరి నియోజకవర్గాల నుంచి టీడీపీ తరపున బరిలో దిగి ఓడిపోయారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరపున నగరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు. 2019లో సైతం తన విజయపరంపరను కొనసాగించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.కోట్లు వెచ్చించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కుప్పం నియోజకవర్గం



అభ్యర్థి పేరు : కృష్ణా రాఘవ జయేంద్ర భరత్
హోదా: ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు
విద్యార్హతలు : బీటెక్
కుటుంబ వివరాలు : భార్య దుర్గా పద్మినీ ఠాగూర్, కుమార్తె కృష్ణా ఆరా, తల్లి పద్మజ
రాజకీయ నేపథ్యం : 2019 కుప్పం సార్వత్రిక ఎన్నికల్లో తండ్రి చంద్రమౌళి గెలుపు కోసం రాజకీయాల్లో ప్రవేశించారు. తదనంతరం కుప్పం అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. కుప్పం మున్సిపాలిటీ, రెవెన్యూ డివిజన్, పోలీస్ డివిజన్ ఏర్పాటుకు కృషిచేశారు. పట్టణంలో గత ఏడాదిగా రాజన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

చిత్తూరు నియోజకవర్గం



అభ్యర్థి పేరు : ఎంసీ విజయానందరెడ్డి
ప్రస్తుత హోదా : ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్
కుటుంబం వివరాలు : భార్య ఇందుమతి, కుమారుడు నిఖిలానందరెడ్డి, తండ్రి చిన్నబ్బరెడ్డి, తల్లి పద్మజ్యోతి
రాజకీయ నేపథ్యం : 2011 నుంచి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేశారు. ప్రజా సేవే పరమావధిగా క్షేత్రస్థాయిలో పేదలకు సాయం అందిస్తున్నారు.

గంగాధర నెల్లూరు నియోజకవర్గం



అభ్యర్థి పేరు: కళత్తూరు కృపాలక్ష్మి
ప్రస్తుత హోదా : వైఎస్సార్‌సీపీ నేత
విద్యార్హతలు: ఫిజియోథెరపీ.
కుటుంబం వివరాలు: తండ్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, తల్లి పరంజ్యోతి, జెడ్పీటీసీ సభ్యులు కార్వేటినగరం, భర్త అనిల్ కుమార్, ఏపీ రీజనల్ హెడ్ ఆఫ్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, కుమారుడు భువనతేజ
రాజకీయ నేపథ్యం : 2004 నుంచి 2019 వరకు జరిగిన ఎన్నికల్లో తండ్రి విజయానికి పనిచేశారు. విజయవాడలో ఉన్న ఓ ఆశ్రమంలో ఏటా ఓ ఆడ బిడ్డని దత్తతకు తీసుకుని విద్యకు, దుస్తులకు అయ్యే ఖర్చులు భరిస్తున్నారు.

పలమనేరు నియోజకవర్గం



అభ్యర్థి పేరు: నల్లప్పగారి వెంకటేగౌడ
హోదా: ఎమ్మెల్యే, పలమనేరు
విద్యార్హత: బీఏ డిగ్రీ
కుటుంబం వివరాలు : భార్య పావని, కుమార్తెలు శివానీ, శరాణీ, తల్లి సునందమ్మ
రాజకీయ నేపథ్యం : వైఎస్సార్‌సీపీ తరఫున 2019 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి గెలుపొందారు. మాజీ మంత్రి అమరనాథ రెడ్డి(టీడీపీ)పై 33 వేల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఎన్‌వీజీ ట్రస్టు ద్వారా పదేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఏటా స్కూలు పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నారు.

పూతలపట్టు నియోజకవర్గం



అభ్యర్థి పేరు : ముత్తిరేవుల సునీల్ కుమార్ ,**ప్రస్తుత హోదా :** మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త , **విద్యార్హత :** ఎంబీబీఎస్, డీఎల్‌ఓ
కుటుంబం వివరాలు : భార్య డాక్టర్ మమతారాణి, కుమారుడు యశ్వంత్, కుమార్తె మాన్విత, తండ్రి రఘునాథయ్య, తల్లి రాధమ్మ
రాజకీయ నేపథ్యం : 2009 నుంచి కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేశారు. 2014 ఎన్నికలలో తొలిసారి వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి గెలుపొందారు.

తిరుపతి జిల్లా

శ్రీకాళహస్తి నియోజకవర్గం



పేరు: బియ్యపు మధుసూదన్‌రెడ్డి
తండ్రి : గోవిందరెడ్డి
తల్లి: బియ్యపు సుశీలమ్మ
భార్య: బియ్యపు శ్రీవాణిరెడ్డి
కుమార్తె: బియ్యపు పవిత్రారెడ్డి
కుమారుడు: బియ్యపు ఆకర్ష్ రెడ్డి
విద్యార్హత– బీఏ
స్వస్థలం: అమ్మపాళెం, శ్రీకాళహస్తి మండలం, తిరుపతి జిల్లా
వృత్తి: బెంగళూరులో వ్యాపారవేత్త
పదవులు: శ్రీకాళహస్తిలో విద్యార్థి యూనియన్ చైర్మన్‌గా ఎన్నిక, 2010 నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా కొనసాగింపు. 2014లో ఎమ్మెల్యేగా ఓటమి. 2019 38,141 ఓట్ల మెజారిటీతో గెలుపు.

వెంకటగిరి నియోజకవర్గం



పేరు: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
విద్యార్హత : బీ.టెక్ (మెకానికల్ ఇంజినీరింగ్ అన్నామలై యూనివర్సిటీ, చెన్నై)
తండ్రి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి
తల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ
పదవులు : ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా సేవలు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కరస్పాండెంట్

తిరుపతి నియోజకవర్గం



పేరు– భూమన అభినయ్ రెడ్డి
హోదా– డెప్యూటీ మేయర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్
విద్యార్హత –ఎం.ఎస్(లండన్)
తండ్రి : భూమన కరుణాకర్‌రెడ్డి (తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్)
తల్లి: భూమన రేవతి
భార్య: భూమన మోనిషారెడ్డి (బీటెక్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)
కుమారుడు –భూమన వీరదయంత్‌రెడ్డి,
కుమార్తె– భూమన ఆర్యహిరెడ్డి
తిరుపతి అభివృద్ధి సేవలు : డెప్యూటీ మేయర్ హోదాలో 20 మాస్టర్ ప్లాన్ రోడ్లు, 10 లింక్ రోడ్లు, 8 ఫ్రీ లెఫ్ట్స్ (కూడలి ప్రాంతాల్లో), అదనంగా మరో ఐదు ప్రధానమైన రోడ్లు ఏర్పాటు. తిరుపతిలోని ప్రధాన కూడలి ప్రాంతాలు సుందరీకరణకు చర్యలు. మెరుగైన మౌలిక వసతులు.

చంద్రగిరి నియోజకవర్గం



పేరు: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
తండ్రి: చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే
తల్లి: చెవిరెడ్డి లక్ష్మి, గృహిణి
విద్యార్హతలు: ఎం.ఎస్ (లండన్)
ప్రస్తుత హోదా: తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం తిరుపతి, కడప జిల్లాల కో–ఆర్డినేటర్
రాజకీయ నేపథ్యం:
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఏడేళ్ల కొనసాగింపు.
- 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుపతి రూరల్ మండలం, పెరుమాళ్లపల్లి ఎంపీటీసీగా పోటీ.. ఏకగ్రీవం. తిరుపతి రూరల్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరణ.
- 2023లో తుడా చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ. టీటీడీ పాలకమండలి సభ్యులుగా కొనసాగింపు

సత్యవేడు నియోజకవర్గం



పేరు: నూకతోటి రాజేష్
తల్లిదండ్రులు : ఎస్.గంగాధరం, హేమలత
భార్య : చైతన్య భాను
కుమారుడు : చరిత్ శ్రీమాన్
స్వగ్రామం : వింజంలక్ష్మీరెడ్డిపల్లి, గంగాధరనెల్లూరు మండలం, చిత్తూరు జిల్లా
విద్య : ఎంఏ, **రాజకీయ నేపథ్యం :** కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సేవాదళ్ కార్యదర్శి (2004–2009)
ప్రస్తుత హోదా : జెన్ స్పోర్ట్స్ అకాడమీ జిల్లా అధ్యక్షుడు, జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

సూళ్లూరుపేట నియోజకవర్గం



పేరు: కిలివేటి సంజీవయ్య
విద్యార్హత: బీటెక్, సివిల్ ఇంజినీరింగ్
తల్లిదండ్రులు:– కిలివేటి రాజయ్య, మస్తానమ్మ
భార్య : సుభాషిణి
పిల్లలు : సౌజన్య, దివిజ
స్వగ్రామం: తడ మండలం, కాదలూరు
రాజకీయ నేపథ్యం : 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు ఎమ్మెల్యే. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులుగా, టీటీడీ బోర్డు మెంబర్‌గా పనిచేశారు.

గూడూరు నియోజకవర్గం



పేరు: మేరిగ మురళీధర్, **విద్యార్హత :** ఎంఏ హిస్టరీ, ఎస్వీ యూనివర్సిటీ
తండ్రి: ఎం. ఆనందరావు **తల్లి:** సుందరమ్మ
భార్య : జ్యోతి, **కుమారులు :** డాక్టర్ రేవంత్, ఎంఎస్సీ ఆర్థోపెడిక్, హేమంత్ కళ్యాణ్, బీటెక్
రాజకీయ నేపథ్యం: రాపూరులోని డిగ్రీ కళాశాల చైర్మన్‌గా ఎన్నిక, 1995లో రాపూరు జెడ్పీటీసీ సభ్యుడిగా ఎంపిక. 2013–15 మధ్యకాలంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగింపు. 2016–19 మధ్య గూడూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా నియామకం. 2021లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకం. 2023లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవం. 2023 అక్టోబర్–4న రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు.

ఎంపీ అభ్యర్థి వివరాలు

తిరుపతి ఎంపీ అభ్యర్థి వివరాలు



పేరు : మద్దెల గురుమూర్తి
స్వగ్రామం : మన్నసముద్రం, శ్రీకాళహస్తి నియోజకవర్గం, తిరుపతి జిల్లా
తల్లిదండ్రులు: రమణమ్మ, మునికృష్ణయ్య
కుటుంబం: భార్య, కొడుకు, ఐదుగురు అక్కాచెల్లెళ్లు
విద్యాభ్యాసం: తిరుపతి స్విమ్స్‌లో ఫిజియోథెరపీ
ప్రస్తుత హోదా: తిరుపతి పార్లమెంటు సభ్యుడు
నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు.

సంక్షేమానికే పట్టం

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకే ప్రజలు పట్టంకడతారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో లబ్ధి పొందని కుటుంబం లేదు. విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత కల్పించారు. ఆరోగ్యశ్రీ ఆర్థిక పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పెద్ద రోగాలకు పెద్ద ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే తప్పకుండా జగనన్నకే రాష్ట్ర ప్రజలు జైకొడతారు.

– మద్దిల గుర్రుమూర్తి, తిరుపతి ఎంపీ అభ్యర్థి

రాజంపేట లోక్‌సభ స్థానం



పేరు : పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి
తల్లిదండ్రులు : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత
విద్య : చెన్నై, **ఉన్నత విద్య :** ఎంబీఏ (లండన్)
స్వస్థలం : ఎర్రాతివారిపల్లె, సదుం మండలం, చిత్తూరు జిల్లా
భార్య : వెంకటలక్ష్మీదివ్య **సంతానం :** జస్విన్‌రెడి, సమన్వి,
రాజంపేట లోక్‌సభ స్థానంలో 2014, 2019లో విజయం. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్, లోక్‌సభ ప్యానల్‌స్పీకర్, ఏపీఎస్ఎల్‌సీసీ చైర్మన్

సంక్షేమ కావాలంటే.. మళ్లీ జగనన్నే రావాలి

రాష్ట్రంలో సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి. 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు మాయమాటలతో అధికారంలోకి వచ్చి, ఒక్క హామీని నెరవేర్చలేదు. 2019 పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ధైర్యంగా ఓట్లు అడుగుతున్న జగనన్నకు ఎంతో తేడా ఉంది. పదేళ్ల క్రితం మోసపోయిన ప్రజలకు జగనన్న భరోసాగా నిలిచారు. ఎన్ని పొత్తులు పెట్టుకున్నా జనం మాత్రం జగనన్న వైపే ఉన్నారు.

– పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి

చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం



అభ్యర్థి పేరు : నీరుగట్టి రెడ్డెప్ప
విద్యార్హతలు : ఎంఏ, బీఎల్,
ప్రస్తుత హోదా: ఎంపీ, చిత్తూరు
కుటుంబ వివరాలు : భార్య ఎస్.రెడ్డెమ్మ, కుమారుడు దినేష్, ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్, కోడలు సుప్రీత, కుమార్తె డాక్టర్ హిమని, అల్లుడు వికాస్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్
రాజకీయ నేపథ్యం : రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా, 1981లో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏడాది పాటు పనిచేశారు. 2019 ఎన్నికల్లో చిత్తూరు ఎంపీగా విజయం.

జగన్‌తోనే దళితుల అభివృది

సామాన్య దళిత కుటుంబంలో పుట్టిన నాకు పార్లమెంటు టికెట్టు ఇచ్చి, ఎంపీని చేసి పార్లమెంటులో కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే దళితుల అభివృద్ధి సాధ్యం. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతోనే నాకు రెండోసారి చిత్తూరు ఎంపీగా టికెట్టు లభించింది. చిత్తూరు జిల్లా ప్రజల వాణిని పార్లమెంటులో వినిపించా. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతా.

– ఎస్.రెడ్డెప్ప, చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి : మండలంలోని చిలకపుత్తూరు గ్రామంలో సారా, నల్లబెల్లం విక్రయిస్తున్న మల్లికార్జున(51) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాయలపేట పంచాయతీ చిలకపుత్తూరులోని నల్ల గంగమ్మ గుడి సమీపంలో ఉన్న రూముల వద్ద శుక్రవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు నల్లబెల్లం, సారా నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. పోలీసు ల రాకను గుర్తించి ఇద్దరు వ్యక్తులు పరారవగా మల్లికార్జున పట్టుబడినట్లు వెల్లడించారు. నిందితుడి నుంచి రూ.1,53,750 విలువైన 41 మూటల నల్ల బెల్లం,రూ.3వేల విలువైన 10 లీటర్ల స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పరారైన ఇద్దరు నిందితులను సైతం త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ తెలిపారు. దాడిలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల పరిధిలోని గంకొండ పాళ్యంలో సారా విక్రయిస్తున్న వై. రాజన్న (55) అనే వ్యక్తిని ఎస్ఐ శ్రీనివాసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

కాణిపాకంలో ప్రోటోకాల్ దర్శనాలు రద్దు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఆలయ ఈఓ వెంకటేశు శనివారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేశామని స్పష్టం చేశారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలన్నారు. మొత్తం 22,594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దని స్పష్టం చేశారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఆర్టీసీ బస్సుల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.

ఎన్నికల నగారా మోగె!

ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో జిల్లా వ్యాప్తంగా రాజకీయ వేడి పెరిగిపోయింది. ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎన్నికల కోడ్) అమలుల్లోకి వచ్చిందని అధికారులు శనివారం ప్రకటించారు. ఈ క్రమంలో ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొత్తగా చేట్టేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రారంభమైన వాటిని మాత్రం కొనసాగించవచ్చని సూచించారు. అత్యవసరం పరిస్థితుల్లో ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో అమలు చేయవచ్చని వెల్లడించారు. ఎన్నికల తేదీ స్పష్టం కావడంతో రాజకీయ పార్టీల నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు అడుగులు వేస్తున్నారు.

- నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ప్రారంభమైన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్
- నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ విభాగం

జిల్లా సమాచారం

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
పుంగనూరు	1,16,623	1,21,172	08	2,37,803	262
నగరి	98,081	1,03,358	08	2,01,447	229
జీడీ నెల్లూరు	1,01,710	1,02,918	07	2,04,635	255
చిత్తూరు	97,765	1,03,023	34	2,00,822	226
పూతలపట్టు	1,08,381	1,11,577	08	2,19,966	260
పలమనేరు	1,32,112	1,34,822	01	2,66,935	287
కుప్పం	1,11,231	1,11,855	18	2,23,104	243
మొత్తం	7,65,903	7,88,725	84	15,54,712	1,762

చిత్తూరు కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ను విడుదల చేసింది. ఎన్నికల ప్రక్రియ అధికారికంగా మొదలుకావడంతో జిల్లా వ్యాప్తంగా ప్రచార పర్వం మొదలు కానుంది. ఇప్పటికే అధికార వైఎస్సార్‌సీపీ గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. ప్రశాంత వాతావరణలో ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఆరు నెలల క్రితం నుంచే కసరత్తు చేస్తోంది. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించే కలెక్టర్ షణ్మోహన్ నేతృత్వంలో అధికారులు, సిబ్బందికి ఇప్పటికే మొదటి దశ శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. ముందస్తుగానే ఎన్నికలను నిర్వహణకు ఏర్పాట్లను దాదాపు పూర్తి చేశారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ర్యాంపులు సిద్ధం చేయించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



“ ఎన్నికల నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తాం. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బృందాలను నియమించాం.

– షణ్మోహన్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

● కట్టుదిట్టంగా 'కోడ్'!

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది.. ఎలక్షన్ కోడ్ మొదలైంది.. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేసేందుకు అధికార యంతాంగ్రం పకడ్బందీ చర్యలు చేపట్టింది. శనివారం ఈ మేరకు చిత్తూరు నగరంలో జల్లెడ పట్టి మరీ పోస్టర్లు తొలగించింది.. పలు ప్రాంతాల్లో రాసిన రాజకీయ పార్టీల నినాదాలపై రంగులు వేసింది.. పలువురు నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగింది.. మేయర్, డిప్యూటీ మేయర్ల కార్లపై పదవులను తెలియజేసే బోర్డులను తీయించింది – చిత్తూరు అర్బన్



విగ్రహానికి ముసుగు వేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది



గోడపై రాజకీయ పార్టీల రాతలకు రంగులు వేయిస్తున్న చిత్తూరు కార్పొరేషన్ కమిషనర్ అరుణ

మెగా జాబ్‌మేళాలో 338 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు

పుత్తూరు: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 477 మంది పాల్గొనగా, 338 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించి ఆయా కంపెనీల వారు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఉపాధి కల్పనే లక్ష్యంగా జాబ్‌మేళాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు నగరి, సత్యవేడు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆర్.వేణుగోపాల్, సురేష్‌కుమార్, జేకేసీ సమన్వయకర్త సంధ్య, వైస్ ప్రిన్సిపల్స్ వీరయ్య, కోటేశ్వరయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌బాబు, సుజనా, దీనదయాల్, లత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు

గుడుపల్లి:మండలంలోని నల్లగాంపల్లె, అంజనాద్రి, పెద్దగొల్లపల్లెలోని టీడీపీకి చెందిన 26 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ వారికి కండువాల వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు రవి, సుబ్రమణ్యం, కిరణ్, మణి, శంకర్ ఆధ్వర్యంలో టీడీపీ కుటుంబాలను పార్టీలోకి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ, కో-కన్వీనర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

ఐదుగురు దోపిడీ దొంగల అరెస్ట్

యాదమరి: గుడిపాల, యాదమరి మండలాల్లో వాహనాలు ఆపి దోపిడీలకు పాల్పడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివరాం ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న రాత్రి 12 గంటల సమయంలో బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో గుడిపాల డ్రమ్స్ ఫ్యాక్టరీ వద్ద ఐషర్ లారీని అడ్డగించి డ్రైవర్ వద్ద నుంచి రూ.6,200లు దోచుకున్నారి వెల్లడించారు. అలాగే ఈ నెల 14వ తేదీ రాత్రి సుమారు 10 గంటలకు బెంగళూరు-తిరుపతి హైవేలో రామభద్రాపురం వద్ద నువ్వుల లోడ్‌తో వస్తున్న లారీని ఆపి డ్రైవర్ వద్ద రూ.18వేలు దోచుకున్నారని వివరించారు. ఈ మేరకు అందిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టామన్నారు. తుమ్మింద పాళ్యం క్రాస్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో రెండు స్కూటీల్లో వస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి రూ.18వేల నగదు, 5 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

చెరుకు తోటకు నిప్పు



చెరుకు తోటలో మంటలు చెలగేరుతున్న దృశ్యం

బైరెడ్డిపల్లె : మండలంలోని మిట్టపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి రమణ అనే రైతుకు చెందిన రెండెకరాల చెరుకు తోటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. వివరాలు.. బైరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులుకు చెందిన భూమిని రమణ కౌలుకు తీసుకుని చెరుకు సాగు చేపట్టాడు. కోత దశలో ఉన్న పంటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది.

చరిత్రలో నిలిచేలా సంక్షేమం

పెనుమూరు(కార్వేటినగరం) : చరిత్రలో నిలిచేలా సంక్షేమ పథకాలు అందించి ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు మహా సముద్రం జ్ఞానేంద్రరెడ్డి కొనియాడారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమలతారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ హేమలతారెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా అర్హుల ఇంటికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. ఇప్పటికే మండలంలో 423 మందికి వైఎస్సార్ సున్నావడ్డీ, 5026 మందికి రైతుభరోసా, కంటి వెలుగు కింద 425 మందికి కళ్లజోళ్లు, అలాగే ఆసరా కింద 887 సంఘాలకు, చేయూత పథకం ద్వారా 1,943 మందికి లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. జలజీవన్ మిషన్ కింద 13 ట్యాంకులు నిర్మించామని, మరో 8 ట్యాంకుల పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం స్థానిక వినాయక నగర్‌కు చెందిన సుధాకర్‌నాయుడు,సుగుణ దంపతుల కుమార్తె నవ్యశ్రీకి సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.85 వేల చెక్‌ను జ్ఞానేంద్రరెడ్డి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



లబ్ధిదారుకి చెక్ అందిస్తున్న జ్ఞానేంద్రరెడ్డి